E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 10-05-2025 (వారం) శనివారం

హైదరాబాద్ పేజీలు–6

e-kaburu.com




భారత్ - పాక్ ఉద్రిక్తతల ఎఫెక్ట్.. ఐపీఎల్ 2025 వారం పాటు వాయిదా

» 6లో

## చందానగర్ లో భారీ అగ్నిప్రమాదం



మంటల్లో కలిపోతున్న బట్టల షోరూమ్ లు

**కాలిపోయిన సెంట్రో, ఆర్ కే బట్టల షాపింగ్ మాల్స్**

**గతంలోనూ ఈ భవనంలో అగ్నిప్రమాదం**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్ లో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చందానగర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న రెండు బట్టల షాపింగ్ మాల్స్ అగ్ని ప్రమాదంలో తగలబడ్డాయి. సెంట్రో షాపింగ్ మాల్ నేమ్ బోర్డులో చోటు చేసుకున్న షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి షాపింగ్ మాల్ మొత్తం మంటలు విస్తరించాయి. ఈ భవనానికి ఆనుకొని ఉన్న ఆర్ కే షాపింగ్ మాల్ కు సైతం మంటలు వ్యాపించడంతో రెండు మాల్స్ మంటల్లో కాలి బూడిద అయ్యాయి. ప్రమాదం జరిగిన భవనాల పక్కనే ఉన్న ఓ ఆసుపత్రికి సైతం మంటలు అంటుకోగా, అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలను ఆర్పివేయడంతో ఆసుపత్రికి ప్రమాదం తప్పింది. శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న భవనంలో గత కొన్ని నెలల క్రితం సెంట్రో షాపింగ్ మాల్ ను ప్రారంభించారు. కాగా శుక్రవారం సాయంత్రం ఈ షాపింగ్ మాల్ కు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. నిర్వాహకులు సకాలంలో స్పందించక పోవడంతో నేమ్ బోర్డు నుంచి మంటలు అంతకంతకు పెద్దవై షాపింగ్ మాల్ మొత్తం విస్తరించాయి. మాల్ లో ఉన్న బట్టలు వేగంగా అంటుకోవడంతో భవనం మొత్తం అగ్నికి ఆహుతైది. ఈ భవనానికి ఆనుకొని ఉన్న భవనంలో ఆర్ కె షాపింగ్ మాల్ కొనసాగుతుండగా మంటలు ఈ మాల్ కు సైతం విస్తరించాయి. దీంతో రెండు భవనాలు భారీ ఎత్తున పొగ, మంటలు వ్యాపించి కాలిపోయాయి.

తరువాయి 2లో



## పాక్ డ్రోన్ల దాడి.. దీటుగా తిప్పికొట్టిన భారత సైన్యం

**పాకిస్థాన్ డ్రోన్ల దాడిని వరుసగా రెండో రోజు కూడా కొనసాగిస్తోంది. ఉత్తరాన బారాముల్లా నుంచి దక్షిణాన భుజ్ వరకు అంతర్జాతీయ సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి 26 ప్రాంతాల్లో డ్రోన్ల దాడికి తెగబడింది**

తరువాయి 2లో

ఈ కబురు : పాకిస్థాన్ డ్రోన్ల దాడిని వరుసగా రెండో రోజు కూడా కొనసాగిస్తోంది. ఉత్తరాన బారాముల్లా నుంచి దక్షిణాన భుజ్ వరకు అంతర్జాతీయ సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి 26 ప్రాంతాల్లో డ్రోన్ల దాడికి తెగబడింది. పౌరులు, ఆర్మీని లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ సాయుధ డ్రోన్లను ప్రయోగిస్తోంది. బారాముల్లా, శ్రీనగర్, అవంతిపొర, జమ్మూ, సాంబా, పఠాన్‌కోట్‌లతో పాటు అమృత్‌సర్, ఫిరోజ్‌పుర్, హోషియార్‌పుర్, గురుదాస్‌పుర్ తదితర ప్రాంతాల్లో దాయాది దేశం డ్రోన్ దాడికి తెగబడిందని సైన్యం తెలిపింది. డ్రోన్ దాడుల్ని భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. వీటిలో కొన్ని ఆయుధాలతో కూడిన డ్రోన్లు ఉన్నాయని అనుమానిస్తున్నారు.

## పాక్ కవ్వింపు చర్యలకు డెడ్ లైన్ ఫిక్స్.. ముగ్గురు సైనిక అధిపతులతో మోదీ వ్యూహం



**ఈ కబురు :ఈ ఉద్రిక్త వాతావరణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అందరు ఆర్మీ చీఫ్‌ల మాదిరిగానే, CDS కూడా సైనిక యూనిఫాంలో కనిపించారు. పాకిస్తాన్ దాడి తర్వాత భారతదేశం తేలికగా తీసుకునే మానసిక స్థితిలో లేదని దీన్ని బట్టి అర్థమవుతోంది. : గత మూడు రోజులుగా భారతదేశం, పాకిస్తాన్ మధ్య అంతర్జాతీయ సరిహద్దులో జరుగుతున్న దాడులతో ప్రపంచం మొత్తం కదిలిపోయింది. ఆపరేషన్ సిందూర్ తో ధైర్యం తెచ్చుకున్న పాకిస్తాన్, నిన్న రాత్రి భారత వైమానిక ప్రాంతాన్ని ఉల్లంఘించడం ద్వారా దూకుడు ప్రదర్శించాలని ప్లాన్ చేసింది.**

తరువాయి 2లో

» 2లో



## డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం కాదు.. ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన

**ఈ కబురు: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ మోడల్ ను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ప్రశ్నలకు విడమరిచి సీఎం రేవంత్ సమాధానాలిచ్చారు. పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాలు చైనా ప్లస్ వన్.. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకోవాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వాటిని సమగ్రంగా తెలియజేశారు.**

“మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ ప్రభుత్వం విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనా రంగాలపై దృష్టిసారించింది. అందులో భాగంగా అనేక వినూత్న ప్రణాళికలకు శ్రీకారం చుట్టాం. ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే తమ ఆలోచన. అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశాం. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశాం. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యాం.

» 2లో

భారత సైన్యానికి ఐసీసీ ఛైర్మన్ జై షా సంఘీభావం

» 6లో




పాక్ యుద్ధాన్ని ఎంచుకుంది.. ఎప్పటికీ మరిచిపోలేని సమాధానం ఇస్తాం: సెహ్వాగ్

» 6లో



శత్రువుల గుండెల్లో భయం నింపాలి.. ఆర్మీకి సెల్యూట్ చేస్తోన్న సెలబ్రిటీలు

» 5లో



ఇంధన కొరతపై ప్రచారం.. స్పష్టతనిచ్చిన ఇండియన్ ఆయిల్

» 4లో




» 2లో



## 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య

**భారత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాకిస్థాన్ దాడులకు తెగబడినట్లు భారత్ వెల్లడించింది.**

**ఈ కబురు: భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది.**

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన ‘ఆసిస్‌గార్డ్ సోంగర్’ డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. ‘‘గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి.

## తెలంగాణ రైతులు, ప్రజలకు గుడ్ న్యూస్.. మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



ఈ కబురు: తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి మెరుగైన సేవలను అందించడానికి రాష్ట్రంలో భూములకు సంబంధించి అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 402 మంది సర్వేయర్లు సరిపోరని, మరికొంత మంది సర్వేయర్లు అవసరమవుతారన్నారు.

» 2లో

## ఉద్రిక్త పరిస్థితులు.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి: నిర్మలా సీతారామన్

**సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు.**


» 6లో



## అందాల ప్రపంచం అరుదెంచు తరుణం

**మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి.**

» 3లో



## అగ్నివీరుడా వందనం..



**‘ఆపరేషన్ సిందూర్’లో తెలుగుబిడ్డ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో దేశమాత కోసం పోరాడుతూ నేలకొరిగాడు. మారుమూల తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మురళీనాయక్ (25)కు చిన్నతనం నుంచి సైన్యంలో చేరాలని కోరిక. యుద్ధ క్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ**

**ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై పోరాటం**

**జమ్మూ కశ్మీర్‌లో అమరుడైన మురళీనాయక్**

**శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాలో విషాదం**

**అగ్నివీర్: మురళీనాయక్**

**స్వగ్రామం: కళ్లితండా, గోరంట్ల మండలం, శ్రీసత్యసాయి జిల్లా**

**సైన్యంలో చేరింది: 2022 డిసెంబరు 29**

**పనిచేస్తున్న యూనిట్: 851 లైట్ రెజిమెంట్**

**తల్లిదండ్రులు: శ్రీరాంనాయక్, జ్యోతిబాయి**

**వృత్తి: దినసరి కూలీలు.**

గోరంట్ల, : ‘ఆపరేషన్ సిందూర్’లో తెలుగుబిడ్డ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో దేశమాత కోసం పోరాడుతూ నేలకొరిగాడు. మారుమూల తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మురళీనాయక్ (25)కు చిన్నతనం నుంచి సైన్యంలో చేరాలని కోరిక. అదే మక్కువతో కష్టపడి ఆర్మీలో చేరారు. కొద్దిరోజులుగా జమ్మూకశ్మీర్ సరిహద్దులో సేవలు అందిస్తూ గురువారం అర్ధరాత్రి పాక్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. మురళి స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండా. తండ్రి శ్రీరాంనాయక్, తల్లి జ్యోతిబాయి. మురళికి చిన్నతనం నుంచి దేశభక్తి ఎక్కువని.. అందుకే రైల్వేలో వచ్చిన ఉద్యోగాన్ని కూడా వదిలి ఆర్మీలో చేరారని గ్రామస్థులు, బంధువులు తెలిపారు. 2022 డిసెంబరులో గుంటూరులో జరిగిన ఎంపిక ప్రక్రియలో అగ్నివీర్‌గా సెలెక్ట్ అయ్యారు. తొలుత పంజాబ్, అస్సాంలలో పనిచేసినట్లు తండ్రి శ్రీరాంనాయక్ చెప్పారు రెండున్నరేళ్ల సర్వీసు పూర్తికావడంతో మరో ఏడాదిన్నరలో అగ్రిమెంట్ పూర్తి చేసుకుని వస్తాడని కలలుకంటున్న తల్లిదండ్రులు.. మురళి వీరమరణం గురించి తెలిసి దుఃఖసాగరంలో మునిగిపోయారు. తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

» 3లో

రికార్డు స్థాయిలో రిటెయిల్ డిపాజిట్లు



» 4లో

మొదటి పేజీ తరువాయి

# పాక్ డ్రోన్ల దాడి.. దీటుగా తిప్పికొట్టిన



డ్రోన్ దాడుల్ని భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. వీటిలో కొన్ని ఆయుధాలతో కూడిన డ్రోన్లు ఉన్నాయని అనుమానిస్తున్నారు. ఫిరోజ్‌పూర్‌లో డ్రోన్ దాడిలో ఓ కుటుంబం గాయపడింది. భద్రతా దళాలు అక్కడికి చేరుకుని గాయపడిన వారికి వైద్య సాయం అందించారు. భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ ద్వారా ఎప్పటి కప్పుడు డ్రోన్ దాడులను తిప్పి కొడుతున్నాయి. భయపడాల్సిన అవసరం లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైన్యం సూచించింది. అత్యవసరమైతేనే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలని విజ్ఞప్తి చేసింది. భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుతున్న క్రమంలో సరిహద్దు రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి హర్ష్ సంఘవి తాజాగా ప్రకటించారు. రాష్ట్ర ప్రజలందరూ దీనిని పాటించాలని కోరారు. ''రాష్ట్రంలో జరిగే ఏ వేడుకల్లోనైనా బాణసంచా, డ్రోన్లపై ఈ నెల 15 వరకు నిషేధం విధిస్తున్నాం. దయచేసి ఈ మార్గదర్శకాలను పాటించాలని, ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతున్నాం'' అని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో జరిగిన సమావేశం అనంతరం ఆయన ఈ పోస్ట్ పెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను మనదేశం ధ్వంసం చేసిన క్రమంలో సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్ పటిష్ఠమైన జాగ్రత్త చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ప్రధాని మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ భద్రతా సన్నద్ధతపై ప్రధాని ఆరాతీసి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అడిగారు. పాకిస్థాన్‌తో పంజాబ్ 532 కి.మీ.; రాజస్థాన్ 1070 కి.మీ.; గుజరాత్ 506 కి.మీ.; బంగ్లాదేశ్‌తో పశ్చిమబెంగాల్ 2,217 కి.మీ. సరిహద్దును పంచుకుంటున్నాయి. గురువారం రాత్రి భారత భూభాగంపైకి పాకిస్తాన్ సంధించిన క్షిపణులను, డ్రోన్‌లను నిర్వీర్యం చేయడంలో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ అద్భుతంలా పనిచేసినందుకు చాలా సంతోషంగా ఉందని దాని సృష్టికర్త, డీఆర్‌డీఓ సైంటిస్టు డాక్టర్ ప్రహ్లాద రామారావు పేర్కొన్నారు. పాక్ క్షిపణులను ఆకాశ్ క్షిపణి వ్యవస్థ ఆపిన రోజు.. నా జీవితంలోనే అత్యంత సంతోషకరమైన రోజు అని ఆయన చెప్పారు. ఉపరితలం నుండి గగనతలంలోకి బహుళ లక్ష్యాలను ఢీకొనేందుకు రూపొందించబడిన ఆకాష్ వ్యవస్థను 15 సంవత్సరాలకు పైగా తీవ్ర కృషితో మాజీ DRDO శాస్త్రవేత్త డాక్టర్ ప్రహ్లాద రామారావు అభివృద్ధి చేశారు. స్థానికంగా అభివృద్ధి చేయబడిన ఆకాష్ క్షిపణి వ్యవస్థ గురువారం రాత్రి పాకిస్తాన్ దాడి చేసినప్పుడు క్షిపణులను, డ్రోన్‌లను తటస్థీకరించడంలోనూ, పశ్చిమ భారతదేశంలోని నగరాలను రక్షించడంలోనూ కీలక పాత్ర పోషించింది. జీవితంలో అత్యంత సంతోషకరమైన రోజు ఇది... నా బిడ్డ రాబోయే శత్రు వైమానిక లక్ష్యాలను ఢీకొట్టడంలో చాలా ఖచ్చితంగానూ, చక్కగానూ పని చేయడం చూసి, డాక్టర్ రామారావు సంతోషంతో పొంగిపోయారు. ఇది అంచనాలకు మించి పనిచేస్తుందని చూసినప్పుడు తన కళ్ళలో నీళ్ళు వచ్చాయని... పాకిస్తాన్ సంధించే తదుపరి క్షిపణులను కూడా సమర్థవంతంగా ఢీకొంటుందని ఆయన అన్నారు ఇప్పుడు డాక్టర్ రామారావు 78 సంవత్సరాల వృద్ధుడు, కానీ భారతదేశ 'క్షిపణి మనిషి', మాజీ రాష్ట్రపతి డాక్టర్ APJ అబ్దుల్ కలాం తనను ఎంపిక చేసుకున్నప్పుడు ఆయన ఆకాష్ కార్యక్రమానికి అతి పిన్న వయస్కుడైన ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉండేవారు. పాక్ పైలట్లు ప్రయాణించే డ్రోన్లు, క్షిపణులు, హెలికాప్టర్లు, యునైటెడ్ స్టేట్స్ తయారు చేసిన సూపర్సోనిక్ F16 ఫైటర్ జెట్‌ల వంటి అత్యంత చురుకైన విమానాలను కూడా అడ్డగించడానికి తాను, తన సహచరులు రూపొందించిన ఈ వ్యవస్థను కొనుగోలు చేయడంలో భారత సైన్యం వెనుకాడిందని ఆయన గుర్తు చేసుకున్నారు. భారతదేశ ఇంటిగ్రేటెడ్ కౌంటర్‌మానవరహిత వైమానిక వ్యవస్థ గ్రిడ్, రష్యన్ నిర్మిత S400, ఇతర విమాన నిరోధక ఆయుధాలతో పనిచేస్తున్న ఆకాశ్ వ్యవస్థ, దృఢంగా ఉండే కవచాన్ని సృష్టించడానికి కలిసి వచ్చింది. ఆకాష్ కోసం తన ట్యాగ్‌లైన్ 'సారా ఆకాష్ హమారా' లేదా 'మొత్తం ఆకాశం మనది' అని డాక్టర్ రామారావు మీడియాతో చెప్పారు, ఆరోజు ఆయన రూపొందించిన ఈ ఆయుధ వ్యవస్థ ఆ ఖ్యాతిని ఆకాశమంత స్థాయిలో నిలబెట్టింది. భారతదేశం, 'తన ఆకాశాన్ని రక్షించుకోగల సామర్థ్యం మాత్రమే కాదు... ఇప్పుడు వాటిని నియంత్రిస్తుంది' అని నిరూపించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆకాశ్ వ్యవస్థను హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తయారు చేస్తుంది. ముఖ్యంగా ఇది వైమానిక ముప్పుల నుండి రక్షణ అందించే స్వల్ప శ్రేణి, ఉపరితలం నుండి గగనతలానికి క్షిపణి వ్యవస్థ. ఇది ఒకేసారి బహుళ లక్ష్యాలను, సమూహంగా లేదా స్వయంప్రతిపత్తితో ఢీకొట్టగలదు. ఇది అంతర్నిర్మిత ఎలక్ట్రానిక్ కౌంటర్‌కౌంటర్ చర్యలను కలిగి ఉంది మరియు మొత్తం వ్యవస్థను మొబైల్ ప్లాట్‌ఫామ్‌లలో కాన్ఫిగర్ చేశారు, ఇది మిలిటరీకి అత్యంత నైపుణ్యం కలిగిన మరియు శక్తివంతమైన అదనంగా చేస్తుంది. ఆకాశ్ వ్యవస్థ 20 కి.మీ ఎత్తులో లక్ష్యాలను ఢీకొట్టగలదు. ప్రతి లాంచర్ మూడు క్షిపణులను కలిగి ఉంటుంది ఇవి 'ఫైర్ అండ్ ఫర్గాట్' మోడ్‌లో పనిచేస్తాయి మరియు ప్రతి క్షిపణి దాదాపు 20 అడుగుల పొడవు మరియు 710 కిలోల బరువు ఉంటుంది. ప్రతి క్షిపణి 60 కిలోల వార్‌హెడ్‌ను కలిగి ఉంటుంది. ఈ వ్యవస్థ పూర్తిగా ఆటోమేటిక్‌గా ఉంటుంది మరియు రియల్‌టైమ్, మల్టీసెన్సార్ డేటా ప్రాసెసింగ్ మరియు ముప్పు మూల్యాంకన సామర్థ్యాలను కలిగి ఉంటుంది మరియు లక్ష్యాలను పొందడం, గుర్తించడం మరియు తటస్థీకరించడం నుండి వేగంగా పనిచేస్తుంది. ఆకాష్ వ్యవస్థను రూ.6,000 కోట్ల ఒప్పందంలో అర్మేనియాకు ఎగుమతి చేశారు. పాక్ మరోసారి తన వక్రబుద్ధి ప్రదర్శించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి వరుసగా రెండో రోజు భారత్‌పై దాడులు చేసింది. అంతర్జాతీయ సరిహద్దులో ఉన్న జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని 20 ప్రాంతాలను టార్గెట్ చేసుకుని శుక్రవారం (మే 9) డ్రోన్లతో దాడులకు పాల్పడిందని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. కీలక నగరాలైన జమ్మూ, పఠాన్ కోట్, అమృత్ సర్, జైసల్మేర్, ఫిరోజ్ పూర్, పోఖ్రాన్ వంటి ప్రాంతాలపై డ్రోన్లతో దాడులకు ప్రయత్నించింది. అవంతిపుర, పఠాన్ కోట్ ఎయిర్ బేస్‌లతో పాటు.. శ్రీనగర్, జైసల్మేర్ ఎయిర్ పోర్టులపై దాడులకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. పాక్ దాడుల నేపథ్యంలో వెంటనే అప్రమత్తమైన భారత సైన్యం.. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ను యాక్టివేట్ చేసింది. భారత గగనతల రక్షణ వ్యవస్థ క్షణాల్లో పాకిస్థాన్ డ్రోన్లను కాల్చి పడేసింది. మరోవైపు పాక్ ఆర్మీ కాల్పులను భారత దళాలు సమర్ధవంతంగా తిప్పికొడుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలో భాగంగా సరిహద్దు ప్రాంతాల్లో వార్ సైరన్లు మోగించి.. పూర్తిగా బ్లాక్ అవుట్ ప్రకటించారు.

## పాకిస్తాన్ లక్ష్యంగా చేసుకున్న నగరాలు:

- అమృత్సర్ (పంజాబ్)
- పఠాన్‌కోట్ (పంజాబ్)
- జమ్మూ (జమ్మూ కాశ్మీర్)
- సాంబా (జమ్మూ కాశ్మీర్)
- ఫిరోజ్‌పూర్ (పంజాబ్)
- పోఖ్రాన్ (రాజస్థాన్)
- కుప్వారా (జమ్మూ కాశ్మీర్)
- ఉరి (జమ్మూ కాశ్మీర్)
- పూంచ్ (జమ్మూ కాశ్మీర్)
- గురుదాస్‌పూర్ (పంజాబ్)
- హంద్వారా (జమ్మూ కాశ్మీర్)
- జైసల్మేర్ (రాజస్థాన్)
- బార్మర్ (రాజస్థాన్)
- రాజౌరి (జమ్మూ కాశ్మీర్)

మొదటి పేజీ తరువాయి

# పాక్ కవ్వింపు చర్యలకు డెడ్ లైన్ ఫిక్స్.. ముగ్గురు సైనిక అధిపతులతో మోదీ వ్యూహం



పాకిస్తాన్ దాడి తర్వాత భారతదేశం తేలికగా తీసుకునే మానసిక స్థితిలో లేదని దీన్ని బట్టి అర్థమవుతోంది. : గత మూడు రోజులుగా భారతదేశం, పాకిస్తాన్ మధ్య అంతర్జాతీయ సరిహద్దులో జరుగుతున్న దాడులతో ప్రపంచం మొత్తం కదిలిపోయింది. ఆపరేషన్ సిందూర్ తో ధైర్యం తెచ్చుకున్న పాకిస్తాన్, నిన్న రాత్రి భారత వైమానిక ప్రాంతాన్ని ఉల్లంఘించడం ద్వారా దూకుడు ప్రదర్శించాలని ప్లాన్ చేసింది. అయితే వారి ఎత్తుగడలు ఏవీ భారత సైన్యానికి వ్యతిరేకంగా పనిచేయవు. ఈరోజు ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , త్రివిధ దళాల అధిపతులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, సీడీఎస్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో, పాకిస్తాన్‌ను తిప్పికొట్టడానికి మరిన్ని సన్నాహాలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఉద్రిక్త వాతావరణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అందరు ఆర్మీ చీఫ్‌ల మాదిరిగానే CDS కూడా సైనిక యూనిఫాంలో కనిపించారు. పాకిస్తాన్ దాడి తర్వాత భారతదేశం తేలికగా తీసుకునే మానసిక స్థితిలో లేదని దీన్ని బట్టి అర్థమవుతోంది. ఈ సమావేశంలో ఎల్ఓసి , అంతర్జాతీయ సరిహద్దు వెంట పాకిస్తాన్ నిరంతర కాల్పుల విరమణ ఉల్లంఘనలు , రెచ్చగొట్టే చర్యలను సమీక్షించారు. ప్రధాని అంతకుముందు ఆర్మీ, వైమానిక దళం , నావికాదళ మాజీ అధిపతులతో సహా సాయుధ దళాల అనుభవజ్ఞులతో చర్చలు జరిపారు. భారతదేశ వ్యూహాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఈ సమావేశం జరిగింది, దీనిలో భవిష్యత్తు చర్యలను చర్చించారు. భారతదేశ రక్షణ విధానానికి మరింత ప్రాధాన్యత ఇవ్వడంలో అనుభవజ్ఞుల అనుభవం ,సలహాలు కీలకమైనవిగా నిరూపించబడతాయి. భారత్, పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. శుక్రవారం (మే 9) రాత్రి పాక్ ఒక్కసారిగా పాక్ దాడులకు తెగబడటంతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ ప్రతినిధులతో ప్రధాని మోడీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ప్రధాని మోడీ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. తాజాగా పాక్ చేస్తోన్న దాడులపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితులను ప్రధాని మోడీకి వివరించారు. సరిహద్దులో జరుగుతోన్న దాడుల గురించి మోడీ ఆరా తీశారు. మరోవైపు పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాలతో సీఎంలతో ప్రధాని మోడీ ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాగా, భారత్ చేతిలో చావు దెబ్బ తిన్న పాక్ మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్, సాంబా, తంగదార్, సెక్టర్లలోని భారత సైనిక స్థావరాలపై శుక్రవారం (మే 9) మళ్లీ కాల్పులకు తెగబడింది. ఓ వైపు కాల్పులు చేస్తూ.. మరోవైపు సరిహద్దులోని పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. సాంబా సెక్టర్, పోఖ్రాన్, ఫిరోజ్‌పూర్, పంజాబ్‌లోని పఠాన్ కోట్‌లో పాక్ డ్రోన్ దాడులకు పాల్పడగా.. వెంటనే అప్రమత్తమైన భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వాటిని గాల్లోని ధ్వంసం చేసింది. పాక్ దాడుల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జమ్మూతో పాటు పలు ప్రాంతాల్లో మళ్లీ వార్ సైరన్లు మోగాయి. పాక్ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్ అవుట్ ప్రకటించారు. పాక్ దాడులకు భారత సైన్యం ధీటుగా బదులిస్తోంది. ఓ వైపు పాక్ ఆర్మీ కాల్పులు తిప్పికొడుతూ.. మరోవైపు గగనతల రక్షణ వ్యవస్థతో పాక్ డ్రోన్లను తునాతునకలు చేస్తోంది. దీంతో మరోసారి ఇరు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.

# డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం కాదు.. ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన



ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే తమ ఆలోచన. అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశాం. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశాం. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యాం. రీజినల్ రింగ్ రోడ్డు లోపలి పరిధిలో పారిశ్రామిక పార్కులు, ఐటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, అటోమొబైల్ ఇండస్ట్రీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పించాలన్నదే ప్రయత్నం. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశాం. రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం. ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుతాయి. మా ప్రభుత్వం సహేతుకమైన ప్రణాళికలతో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంది. ప్రతి అంశాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నదే ప్రయత్నం. ఇటీవల జపాన్ దేశ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని సంకల్పించాం. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈ సర్వే సమాజాన్ని మరింత సమర్థవంతంగా గుర్తించి సేవలు అందించడంలో దోహదపడుతుంది. ఇది కేవలం బీసీల కోసమే కాదు. ఈ సర్వే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలకూ ఉపయోగపడుతుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలి. ఈ రకంగా అనేక కోణాల్లో తెలంగాణ రైజింగ్ మొదలైంది. తెలంగాణలోని వేర్వేరు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐసోలేషన్ గా సాగుతున్న విద్యను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా పిల్లల్లో సోషలైజేషన్ ప్రక్రియకు చేపట్టాం. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక కీలకమైన నిర్ణయం.

జనాభాలో దాదాపు 60 శాతమున్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రైతులకు 21,617 కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేశాం. రైతులకు ఏటా 12 వేలు ఇన్‌పుట్ సబ్సిడీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నాం. అలాగే 67 లక్షల సభ్యులున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తిని అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ వంటి బాధ్యతలన్నీ వారికే అప్పగించాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం.

అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నాం. స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 105 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నాం. ఇవన్నీ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చూపించడంలో భాగంగా చేపట్టాం. డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం కాదు. కానీ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియకు సంబంధించి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి అందుకు ప్రాతిపదికను స్పష్టంగా వెల్లడించాలి. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్. అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించకూడదు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశం. అందుకే చర్చ జరగాలని అడుగుతున్నాం'' అని అన్నారు.

ఈ కార్యక్రమంలో తొలుత ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, "మొదటగా నేను భారతీయ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాను. దేశాన్ని రక్షించడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం కాపలాకాస్తోంది. ఈ సమయంలో అందరం సైనికులకు మద్దతు తెలపాలి'' అని పిలుపునిచ్చారు.

మొదటి పేజీ తరువాయి

## తెలంగాణ రైతులు, ప్రజలకు గుడ్ న్యూస్.. మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



యర్లను తీసుకోవడం, మరో వైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీ చేయడం ఇంకో వైపు భూముల సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం సచివాలయంలో సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి మండలం, పట్టణంలో భూ విస్తరణ, భూ లావాదేవీలను బట్టి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 వేల మంది లైసెన్స్డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నామని వెల్లడించారు. లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గలిగిన అభ్యర్థుల నుంచి ఈ నెల 17 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం) ఒక అంశంగా ఉండి, కనీసం 60% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ నుంచి డ్రాఫ్ట్స్ మన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బి.టెక్ (సివిల్) లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులకు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2500 చెల్లించవలసి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో 50 పని దినాల్లో తెలంగాణ అకాడమి (ల్యాండ్ ఇన్ఫర్మేషన్ & మేనేజ్మెంట్) ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ మొత్తం ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించి వీలైనంత త్వరగా లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, కమిషనర్ ఆఫ్ సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖ జ్యోతి బుద్ధ ప్రకాష్, సీసీఎల్ఏ సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరంద్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య



ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. "గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్-పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.

10- 05 -2025
శనివారం
e kaburu.com
ఈ-కబురు
3

# తెలంగాణ కోసం తుదిశ్వాస వరకు పోరాడిన 'కొండకల్' : కొమిరిశెట్టి సాయిబాబా



బీఆర్ఎస్ నాయకులతో కలిసి శంకర్ గౌడ్ కు నివాళులర్పిస్తున్న సాయిబాబా

### ఖాజాగూడలో కొండకల్ శంకర్ గౌడ్ జయంతి వేడుకలు

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన తుదిశ్వాస వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి దివంగత కొండకల్ శంకర్ గౌడ్ అని బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకుడు దివంగత కొండకల్ శంకర్ గౌడ్ 57వ జయంతిని పురస్కరించుకుని కొమిరిశెట్టి సాయిబాబా ఘనంగా నివాళులు అర్పించారు. ఖాజాగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండకల్ శంకర్ గౌడ్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సాయిబాబా, తాను కొండకల్ శంకర్ గౌడ్ ను రాజకీయ గురువుగా బావిస్తానని అన్నారు. తనలాంటి ఎందరికో రాజకీయ అవకాశం కల్పించిన ఘనత శంకర్ గౌడ్ దని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున రగిలించి, తనవంటి ఎందరినో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వైపు నడిపించారని గుర్తు చేశారు. నేడు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఇంత పటిష్టంగా ఉండడానికి కారణం శంకర్ గౌడ్ వేసిన పునాది అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల గుండెల్లో కొండకల్ శంకర్ గౌడ్ చిరస్థాయిగా నిలిచి పోతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొండకల్ శంకర్ గౌడ్ ను ఆదర్శంగా తీసుకొని శేరిలింగంపల్లి పరిధిలో పార్టీ పటిష్టతను కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చెన్నం రాజు, దారుగుపల్లి నరేష్, అంజమ్మ, రమేష్ గౌడ్, యాదగిరి, బురాన్, బాలమణి,మాధవి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు బానిసగా మారిన లేడీ డాక్టర్

- వాట్సాప్ లో ముంబై వ్యక్తికి కొకైన్ ఆర్డర్
- రాయదుర్గంలో అందజేస్తుండగా అరెస్ట్
- రూ. 5 లక్షల విలువైన 53 గ్రాముల కొకైన్ స్వాధీనం



ఈకబురు, శేరిలింగంపల్లి : ఆరోగ్యం మీద శ్రద్ధ చూపాలని రోగులకు సలహాలు ఇచ్చి... అనారోగ్యం బారిన పడిన రోగులకు చికిత్స అందజేసే డాక్టరే డ్రగ్స్ కు బానిసగా మారింది. ఎక్కడో ముంబైలో ఉండే డ్రగ్స్ సరఫరాదారుడికి వాట్సాప్ ద్వారా ఆర్డర్ పెట్టి నగరానికి యదేచ్ఛగా నిషేధిత కొకైన్ డ్రగ్స్ తెప్పించుకుంటుంది. విషయం తెలిసిన పోలీసులు ముంబై నుంచి డ్రగ్స్ తెచ్చి రాయదుర్గంలో లేడీ డాక్టర్ కు అందజేస్తుండగా ఇద్దరిని వలపని పట్టుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి... నగరంలోని షేక్ పేట ఏపీఏహెచ్ సీ కాలనీలో గల అపర్ణ వాన్ సీ బ్లాక్ లోని 31వ అంతస్థులో డాక్టర్ చిగురుపాటి నమ్రత(34) నివాసం ఉంటుంది. నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో డాక్టర్ గా పనిచేస్తున్న నమ్రత గతకొన్ని సంవత్సరాలుగా నిషేధిత కొకైన్ డ్రగ్స్ కు బానిసగా మారింది. ముంబైలో నివాసం ఉండే వాన్స్ టక్కర్ ను వాట్సాప్ ద్వారా సంప్రదించిన నమ్రత 5 లక్షల రూపాయల కొకైన్ డ్రగ్స్ ఆర్డర్ చేసింది. ఈ మేరకు డబ్బును మొత్తం ఆన్ లైన్ ద్వారా పంపించింది. దీంతో టక్కర్ తన వద్ద డెలివరీ బాయ్ గా పనిచేసే బాలకృష్ణ రాంప్యార్ రామ్(38)కు డ్రగ్స్ ఇచ్చి నగరానికి పంపించాడు. నగరంలోని రాయదుర్గంలో నమ్రతను కలిసిన రాంప్యార్ రామ్ డ్రగ్స్ ను అందజేస్తుండగా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. డ్రగ్స్ డెలివరీ చేస్తున్న రాంప్యారి రామ్, డ్రగ్స్ తెప్పించుకున్న డాక్టర్ నమ్రతలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5 లక్షల రూపాయల విలువైన 53 గ్రాముల కొకైన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా నమ్రతను పోలీసులు విచారించగా పలు విటుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తుంది. డాక్టర్ గా పనిచేస్తున్న నమ్రత డ్రగ్స్ కు బానిసగా మారి ఇప్పటి వరకు 70 లక్షల రూపాయల వరకు డ్రగ్స్ కోసం ఖర్చు చేసినట్లుగా పోలీసులు గుర్తించారు.

# చందానగర్ లో భారీ అగ్నిప్రమాదం




మంటల్లో కలిపోతున్న బట్టల షోరూమ్ లు




మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న భవనంలో గత కొన్ని నెలల క్రితం సెంట్రో షాపింగ్ మాల్ ను ప్రారంభించారు. కాగా శుక్రవారం సాయంత్రం ఈ షాపింగ్ మాల్ కు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. నిర్వాహకులు సకాలంలో స్పందించక పోవడంతో నేమ్ బోర్డు నుంచి మంటలు అంతకంతకు పెద్దవై షాపింగ్ మాల్ మొత్తం విస్తరించాయి. మాల్ లో ఉన్న బట్టలు వేగంగా అంటుకోవడంతో భవనం మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ భవనానికి ఆనుకొని ఉన్న భవనంలో ఆర్ కె షాపింగ్ మాల్ కొనసాగుతుండగా మంటలు ఈ మాల్ కు సైతం విస్తరించాయి. దీంతో రెండు భవనాలు భారీ ఎత్తున పొగ, మంటలు వ్యాపించి కాలిపోయాయి.

**హాస్పిటల్ కు తప్పిన ప్రమాదం...**

అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న భవనాల పక్కనే ఉన్న మరో భవనంలో వుంబ్ ఫెర్టిలిటీ సెంటర్ ఆసుపత్రి కొనసాగుతుంది. పక్క భవనాల్లో చెలరేగిన మంటలు ఆసుపత్రి భవనానికి సైతం వ్యాపించాయి. దీంతో ఆసుపత్రి నిర్వాహకులు లోపల ఉన్న పేషెంట్లను హుటాహుటిన భవనం బయటకు తరలించారు. అప్పటికే అక్కడికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేయగా ఏసీలు, కిటికీలు, ఇతర సామాగ్రి మంటలకు కాలిపోయాయి. అగ్ని ప్రమాదం కారణంగా రెండు భవనాల్లోని బట్టల షో రూమ్ లు కాలిపోవడంతో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది రావడం ఆలస్యం కావడంతో మంటలు అంతకంతకు పెరిగి రెండు షోరూంలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది 10 ఫైర్ ఇంజన్లు ఓ బాహుబలి యంత్రాన్ని తీసుకువచ్చి మంటలను అదుపు చేశారు.

**గతంలోనూ కాలిపోయిన భవనం...**

అగ్ని ప్రమాదం జరిగిన సెంట్రో షాపింగ్ మాల్ కొద్ది నెలల క్రితమే ప్రారంభం కాగా, గతంలో ఇదే భవనంలో మరో భారీ వాణిజ్య సముదాయం ఉండేది. ఈ భవనంలో కొన్ని సంవత్సరాల క్రితం ఇదే తరహాలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా.. నాడు ఆ వ్యాపార సముదాయం పూర్తిగా మంటల్లో కాలిపోయింది. అనంతరం భవనాన్ని మరమ్మత్తులు చేసి తిరిగి సెంట్రో షాపింగ్ మాల్ ను ఈ భవనంలో ప్రారంభించారు. ఈ షాపింగ్ మాల్ ప్రారంభించిన నెలల వ్యవధిలోనే మరోసారి అగ్ని ప్రమాదంతో కాలి బూడిదయింది. అగ్ని ప్రమాదంలో రెండు షాపింగ్ మాల్స్ పూర్తిగా కాలిపోగా కోట్లలో ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తుంది.

**అగ్నిప్రమాదానికి కారకులెవ్వరు... ?**

చందానగర్ లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదం ఎవరి నిర్లక్ష్యం కారణంగా చోటుచేసుకుందని స్థానికులు నిలదీస్తున్నారు. గతంలో ఇదే భవనంలో అగ్ని ప్రమాదం జరిగి ఓ షాపింగ్ మాల్ మొత్తం అగ్నికి ఆహుతి కాగా.. దాని నుంచి పాఠాలు నేర్వని భవన యజమానులు కనీస జాగ్రత్తలు తీసుకోని కారణంగానే మరోసారి ప్రమాదం చోటుచేసుకుంది. అగ్ని ప్రమాదం సంభవిస్తే చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగే సెట్ బ్యాక్ సైతం వదలకుండా భవనానికి భవనం ఆనుకొని కట్టడం, అందులో వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేయడంతోనే మంటలు ఇతర భవనాలకు వ్యాపించాయి. శుక్రవారం చోటుచేసుకున్న ప్రమాదంలో పక్క పక్కనే ఉన్న మూడు భవనాలకు మంటలు అంటుకోగా, ఏ భవనంలోనూ ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో లేకపోవడం శోచనీయం. భవనాలకు ఏర్పాటుచేసిన ఫైర్ సేఫ్టీ పైపులు సైతం నామమాత్రంగా ఉండడం నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని కళ్లకు కడుతుంది. కనీస ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన భారీ వాణిజ్య సముదాయాలకు ఫైర్ ఎన్ఓసి ఏ విధంగా ఇచ్చారో అధికారులకే తెలియాలి.

# మిస్ వరల్డ్ ఏర్పాట్లను పరిశీలించిన గ్రేటర్ కమిషనర్

### శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశం

ఈకబురు, శేరిలింగంపల్లి : మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం కొనసాగుతున్న ఏర్పాట్లను శుక్రవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి.కర్ణన్ పరిశీలించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్, పలు విభాగాల అధికారులతో కలిసి ప్రారంభోత్సవ వేదికైన గచ్చిబౌలి స్టేడియంలో పర్యటించిన గ్రేటర్ కమిషనర్.. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. మిస్ వరల్డ్ పోటీలు జరిగినన్ని రోజులు వేదికల వద్ద, పరిసరాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందిని ఎక్కువ మందిని నియమించి, పరిసరాలు ఎప్పటికప్పుడు క్లీన్ గా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేడియం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ప్రోగ్రామ్ కు సంభందించిన వివరాలు తెలిసే విధంగా ప్రచార సామగ్రిని పెట్టించాలని జిహెచ్ఎంసి అడ్వర్టైజ్మెంట్ అడిషనల్ కమీషనర్ ను ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ తో పాటు జోనల్ కమీషనర్ బొఖడే హేమంత్ సహదేవ్ రావు, అడ్వర్టైజ్మెంట్ అడిషనల్ కమీషనర్ వేణుగోపాల్ రెడ్డి,శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు ఉన్నారు.



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రేటర్ కమిషనర్

# ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేత




ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన గదులను కూల్చివేస్తున్న దృశ్యం

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడలో గల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మండల పరిధిలోని ఖాజాగూడ సర్వేనెంబర్ 27 లో ప్రభుత్వ స్థలం ఉంది. కాగా ఈ ప్రభుత్వ స్థలాన్ని గతకొన్ని రోజులుగా కొంతమంది అక్రమార్కులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు మండల రెవెన్యూ అధికారులకు పిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన శేరిలింగంపల్లి తహసిల్దార్ వెంకారెడ్డి వెంటనే సదరు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం సర్వేనెంబర్ 27లో పర్యటించిన ఆర్ఐ చంద్రారెడ్డి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను గుర్తించారు. అనంతరం జెసిబితో సదరు నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అగ్నివీరుడా వందనం..



**తల్లిదండ్రులతో ఆర్మీ దుస్తుల్లో మురళి**

**ఏకైక సంతానం..**

మురళి తల్లిదండ్రులు తమ ఏకైక కుమారుడిని ఉన్నత స్థాయిలో చూడాలని ఆశించారు. ఇందుకోసం ఎన్ని కష్టాలకైనా సిద్ధమై పనుల కోసం ముంబయికి వెళ్లారు. అక్కడ తండ్రి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి ఇళ్లలో పనులు చేస్తున్నారు. మురళిని నాగినాయని చెరువు తండాలో అమ్మమ్మ దగ్గర ఉంచి చదివించారు. మురళి పదో తరగతి వరకు సోమందేపల్లిలో, ఇంటర్మీడియట్, డిగ్రీ అనంతపురంలో పూర్తి చేశారు. శ్రీరాంనాయక్, జ్యోతిబాయి దంపతులు తండాలో మంగళవారం జరిగిన జాతరలో పాల్గొనడానికి ముంబయి నుంచి వచ్చారు. బంధువులు, సన్నిహితులతో ఆనందంగా గడిపారు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చిందని రోదిస్తున్నారు. 'పంజాబ్‌లో పని చేస్తున్నట్లు చెప్పాడే తప్ప జమ్మూ కశ్మీర్‌లో డ్యూటీ అని మాకు చెప్పనేలేదు' అని మురళి తండ్రి శ్రీరాంనాయక్ తెలిపారు. 'గురువారం ఉదయం మాతో వీడియో కాల్ మాట్లాడాడు. తాను బాగున్నానని చెప్పాడు. మేం ఎలా ఉన్నామని అడిగాడు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది' అంటూ బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు.

**వీరజవాన్ తల్లిదండ్రులను ఓదార్చుతున్న మంత్రి సవిత**

**పెళ్లి చేయాలని.. ఇల్లు కట్టుకుని..**

గారాబంగా పెంచుకుంటున్న కుమారుడికి పెళ్లి చేయాలనే యోచనతో తండాలో ఇటీవలే కొత్తగా ఇల్లు కట్టుకున్నారు. అతడి మరణవార్తతో ఇక తామెవరి కోసం బతకాలంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మురళీనాయక్ భౌతికకాయం శనివారం కళ్లితండాకు చేరనుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అదేరోజు ప్రభుత్వ అధికార లాంఛనాలతో స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మంత్రి సవిత రూ. 5 లక్షల సాయం**

మురళీనాయక్ వీరమరణం గురించి తెలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత శుక్రవారం తండాకు చేరుకుని ఆయన తల్లిదండ్రులను ఓదార్చారు. తనవంతు సాయంగా రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పకుండా ఆదుకుంటాయని భరోసా ఇచ్చారు. తండ్రి శ్రీరాంనాయక్ కోరిక మేరకు యువతకు స్ఫూర్తినిచ్చేలా తండాలోని వారి సొంత పొలంలో విగ్రహం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

# అందాల ప్రపంచం అరుదెంచు తరుణం

### నేడు హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల ప్రారంభం

### ఈ నెల 31 వరకు రాష్ట్రంలో సుందరీమణుల సందడి

ఈనాడు, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాల మేళవింపుతో జరగనున్న 72వ ప్రపంచ సుందరి వేడుకలకు 110కి పైగా దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటున్నారు. ఈ నెల 31 వరకు జరగనున్న పోటీలకు హైదరాబాద్‌లోని వేదికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 2024 ప్రపంచ సుందరి చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిజ్కోవాతోపాటు మిస్ మాంటి నీగ్రో ఆండ్రియో నికోలిక్, మిస్ అల్బేనియా ఎలోనా డ్రెకాజ్ శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో వారికి సంప్రదాయ విధానంలో స్వాగతం పలికారు.

**150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం**

ప్రారంభ వేడుకలకు వేదికైన గచ్చిబౌలి స్టేడియాన్ని అలంకరించారు. హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తున్న మిస్‌వరల్డ్ పోటీలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన రాష్ట్రప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. తెలంగాణకు చెందిన జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాదీ కళారూపాలను సమ్మిళితం చేసి రాష్ట్ర ఖ్యాతి, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేలా ప్రణాళిక రచించారు. పోటీల ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం కూడా గచ్చిబౌలి స్టేడియంలో కొన్ని దేశాలకు చెందిన సుందరీమణులు రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. సాంస్కృతిక బృందాలు రిహార్సల్స్‌ను నిర్వహించాయి. శనివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రపంచ సుందరి పోటీల ఛైర్‌పర్సన్ జూలియో మోర్లే, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా సహా పలువురు పాల్గొననున్నారు. ప్రారంభ కార్యక్రమాల అనంతరం ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణులను ఖండాల వారీగా పరిచయం చేస్తారు. ఈ వేడుకలు 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**మిస్ అల్బేనియా ఎలోనాకు సంప్రదాయ స్వాగతం**

దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని కోణాల్లో చర్చించింది. ప్రభుత్వ పరంగా ఎక్కువ ఆర్భాటం చేయకూడదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. వివిధ దేశాల నుంచి పోటీదారులు ఇప్పటికే వచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొద్దిగంటల సమయమే ఉంది. ప్రభుత్వవర్గాలు, ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవానికి పరిమితమై మిగతా కార్యక్రమాలు మిస్‌వరల్డ్ నిర్వాహకులు ప్రైవేటు కార్యక్రమంలా నిర్వహించుకునేలా చూడాలన్న నిర్ణయానికి సర్కారు వచ్చినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈనెల 13న చౌమహల్లా ప్యాలెస్‌ను సందర్శించనున్న మిస్‌వరల్డ్ పోటీదారులకు ఇచ్చే డిన్నర్‌ను రద్దు చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే కార్యక్రమాల కుదింపు, అవుట్‌డోర్ పర్యటనల తగ్గింపు వంటివి ఉంటాయని ప్రభుత్వవర్గాల సమాచారం. అనూహ్య పరిణామాలు జరిగితే మాత్రం పోటీల రద్దుపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.




# ఇంధన కొరతపై ప్రచారం..

## స్పష్టతనిచ్చిన ఇండియన్ ఆయిల్

**భారత్ - పాక్ ఉద్రిక్తతల వేళ ఇంధన నిల్వలపై ఆందోళన వ్యక్తంచేస్తూ ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తాజాగా స్పష్టతనిచ్చింది.**

పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ఆన్‌లైన్ వేదికగా పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా చమురు నిల్వల్లో కొరత ఏర్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలోఉంచుకొని ప్రజలు త్వరితగతిన ఇంధనాన్ని కొనుగోలు చేయాలని పలువురు భావిస్తున్నారు. ఆయా ప్రచారాలపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్పష్టతనిచ్చింది. ఇంధన నిల్వల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. తమవద్ద తగినంత నిల్వలు ఉన్నట్లు ప్రకటించింది.

“దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు కలిగిఉన్నాం. మా సరఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఎల్‌పీజీ మా అన్ని అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతంగా ఉండి, అనవసరమైన రద్దీని నివారించి మెరుగైన సేవలు అందించడంలో మాకు సహాయపడండి. మా సరఫరా లైన్లు సజావుగా నడుపుతుంటాం” అని పేర్కొంది.

# రికార్డు స్థాయిలో రిటెయిల్ డిపాజిట్లు

**కెనరా బ్యాంకు గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రికార్డు స్థాయిలో రూ.17,000 కోట్ల రిటెయిల్ డిపాజిట్లు సేకరించింది. బ్యాంకు చరిత్రలో ఇదొక రికార్డు.**

**కెనరా బ్యాంకు ఘనత**
**రూ.17,026 కోట్ల వార్షిక నికరలాభం**
**ఒక్కో షేరుకు రూ.4 డివిడెండ్**



**హైదరాబాద్:** కెనరా బ్యాంకు గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రికార్డు స్థాయిలో రూ.17,000 కోట్ల రిటెయిల్ డిపాజిట్లు సేకరించింది. బ్యాంకు చరిత్రలో ఇదొక రికార్డు. ప్రతి ఒక్క ఉద్యోగి కనీసం రూ.10 లక్షల వరకూ డిపాజిట్లు తీసుకువచ్చే విధంగా ప్రోత్సహించడంతో సత్ఫలితాలు వచ్చినట్లు కెనరా బ్యాంకు ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణ రాజు ‘ఈనాడు’కు వెల్లడించారు. రిటెయిల్ డిపాజిట్లు అధికంగా సేకరించటం వల్ల నికర వడ్డీ మిగులు(ఎన్ఐఎం) గత ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి ఉన్న 2.7 శాతం నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి 2.73 శాతానికి పెరిగిందన్నారు. ఇదే కాకుండా నాలుగో త్రైమాసికంలో అన్ని విభాగాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యున్నత ప్రమాణాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

**మూడేళ్లలో మూడు రెట్లు..**
గత ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు రూ.17,026 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 202122 ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.5,700 కోట్లు మాత్రమే. అంటే గత మూడేళ్లలో లాభం మూడు రెట్లు పెరిగినట్లయింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,42,207 కోట్ల మొత్తం ఆదాయం నమోదైంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.1,27,654 కోట్లు, నికరలాభం రూ.14,554 కోట్లు ఉన్నాయి.

**త్రైమాసిక లాభంలో 33% వృద్ధి**
గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి. బ్యాంకు నికర లాభం 33.19 శాతం వృద్ధితో రూ.5,004 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో లాభం రూ.3,757 కోట్లు మాత్రమే. త్రైమాసిక ఈపీఎస్‌లో వృద్ధి 16.98 శాతం ఉంది. ఆపరేటింగ్ లాభం 12.14 శాతం వృద్ధితో రూ.8,284 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.94 శాతం, నికర నిరర్థక ఆస్తులు 0.70 శాతానికి దిగివచ్చాయి. డిపాజిట్లలో 11.01 శాతం, రుణాల్లో 11.74 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం వ్యాపారం రూ.25,30,215 కోట్లకు చేరింది.

**వసూళ్లకు ప్రాధాన్యం...**
రానిబాకీల వసూళ్లకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు, నాలుగో త్రైమాసికంలోనూ రూ.2,700 కోట్లు వసూలు చేసినట్లు సత్యనారాయణ రాజు వెల్లడించారు. డిపాజిట్ల వ్యయం మరీ ఎక్కువ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి కెనరా బ్యాంకుకు 9,849 శాఖలు, 9,579 ఏటీఎంలు ఉన్నాయి. వాటాదార్లకు ఒక్కో షేరుకు రూ.4 చొప్పున డివిడెండ్ చెల్లించాలని డైరెక్టర్ల బోర్డు సిఫార్సు చేసింది.

**తెలుగు రాష్ట్రాల్లో 50 కొత్త శాఖలు:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 50 కొత్త శాఖలు త్వరలో ప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు. ఇందులో అమరావతి పరిసర ప్రాంతాల్లో 25 శాఖలు; తిరుపతి వద్ద 10 శాఖలు; తెలంగాణ రాష్ట్రంలో 15 శాఖలు వస్తాయని తెలిపారు.

**యూనియన్ బ్యాంక్ లాభం రూ.4,985 కోట్లు**
**దిల్లీ:** జనవరి మార్చి త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ నికర లాభం రూ.4,985 కోట్లుగా నమోదైంది. 202324లో ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,311 కోట్లతో పోలిస్తే లాభం 51% పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.9,437 కోట్ల నుంచి రూ.9,514 కోట్లకు చేరింది. స్థూల నిర్థరక ఆస్తుల నిష్పత్తి 4.76 శాతం నుంచి 3.6 శాతానికి; నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.03% నుంచి 0.63 శాతానికి తగ్గింది. కేటాయింపులు 13% పెరిగి రూ.1,676 కోట్లకు చేరాయి. 202425కి రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.4.75 (47.50%)ను డివిడెండుగా చెల్లించాలని బోర్డు సిఫారసు చేసింది.




# యెస్ బ్యాంకులో వాటాల విక్రయం..

# 13% వదులుకోనున్న ఎస్‌బీఐ

**ఎస్‌బీఐ సహా ఏడు బ్యాంకులు యెస్ బ్యాంకులో వాటాలను వదులుకోనున్నాయి. 20 శాతం వాటాలను జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీకి విక్రయించనున్నాయి.**

**దిల్లీ:** ప్రైవేటు రంగానికి చెందిన యెస్ బ్యాంకులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు మరో ఏడు బ్యాంకులు తమ వాటాల్ని వదులుకోనున్నాయి. జపాన్‌కు చెందిన సుమిటోమో మిట్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ కి రూ.13,483 కోట్లకు తమ వాటాను విక్రయించనున్నాయి. ఈ విక్రయం ద్వారా యెస్ బ్యాంకులో ఎస్ఎంబీసీ అతిపెద్ద వాటాదారుగా నిలవనుంది. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలోకి అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదే కానుంది. సంక్షోభంలోకి వెళ్లిన యెస్ బ్యాంకును 2020లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని బ్యాంకుల బృందం అందులోని వాటాలు కొనుగోలు చేశాయి. 24 శాతం వాటాతో ఎస్‌బీఐ అతిపెద్ద వాటాదారుగా నిలిచింది. అందులో 13.19 శాతం వాటాలను తాజాగా రూ.8,888.97 కోట్లకు విక్రయించనుంది. ఇంకా 10 శాతం వాటా మిగిలి ఉంటుంది. ఎస్‌బీఐతో పాటు అప్పట్లో వాటాలు కొనుగోలు చేసిన వాటిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (2.75%), ఐసీఐసీఐ బ్యాంక్ (2.39%), కోటక్ మహీంద్రా బ్యాంక్ (1.21%), యాక్సిస్ బ్యాంక్ (1.01%), ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ (0.92%), ఫెడరల్ బ్యాంక్ (0.76%), బంధన్ బ్యాంక్ (0.70%) ఉన్నాయి. ఇప్పుడు ఆయా బ్యాంకులన్నీ కలిసి 6.81 శాతం మేర వాటాను రూ.4,594 కోట్లకు విక్రయించనున్నాయి. ఒక్కో ఈక్విటీ షేరును రూ.21.50 శాతం ధరకు విక్రయించనున్నట్లు ఎస్‌బీఐ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. రిజర్వ్ బ్యాంక్, కాంపీటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ డీల్ పూర్తయితే యెస్ బ్యాంక్ మరింత వృద్ధి దిశగా పయనించే అవకాశం ఉంటుందని యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఎస్ఎంబీసీ వంటి అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజం నుంచి ప్రపంచస్థాయి నైపుణ్యాలు, పాలనా ప్రమాణాలు తమకు ప్రయోజనం చేకూరుస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎంబీసీ మాతృ సంస్థ అయిన సుమిటోమో మిట్సుయ్ ఫైనాన్షియ్ గ్రూప్ జపాన్‌లో రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్. ఎస్ఎంబీసీతో పాటు, ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ ఇప్పటికే దేశీయంగా సేవలందిస్తున్నాయి.

# భారత్-పాక్ ఉద్రిక్తతల ఎఫెక్ట్:

## సెన్సెక్స్ 880 పాయింట్లు డౌన్.. మళ్లీ 80 వేల దిగువకు




**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 880 పాయింట్లు, నిఫ్టీ 265 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.**

**ముంబయి:** భారత్‌పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులకు యత్నించడంతో భారత్ వాటిని సమర్థంగా తిప్పికొట్టింది. ఇవి మరింత తారస్థాయికి చేరొచ్చన్న భయాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు క్షీణించాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా రెండో రోజూ మన సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోయి.. మళ్లీ 80వేల దిగువకు చేరగా.. నిఫ్టీ 24వేల కాస్త ఎగువన ముగిసింది.

భారత్‌పాక్ నడుమ ఉద్రిక్తతల వేళ విమాన యానం, టూరిజం, రియాల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదే సమయంలో డిఫెన్స్ సంబంధిత స్టాక్స్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. డ్రోన్ల తయారీ కంపెనీ ఐడియా ఫోర్జ్ షేర్లు ఏకంగా 18 శాతం మేర పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ ఫ్లాట్‌గా ముగియగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం మేర నష్టోయింది. మార్కెట్ ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 2.98 శాతం పెరిగి 21.63కు చేరింది. ఇంట్రాడేలో 8 శాతం వరకు పెరిగింది.

సెన్సెక్స్ ఉదయం 78,968.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,334.81) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే చలించింది. ఇంట్రాడేలో 78,968.34 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 880.34 పాయింట్ల నష్టంతో 79,454.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 265 పాయింట్ల నష్టంతో 24,008.00 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.41గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. టైటాన్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ, ఏషియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 3,329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# ఉద్రిక్త పరిస్థితులు.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి: నిర్మలా సీతారామన్

**సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు.**

భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. వినియోగదారులు, వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది కలగకుండా చూడాలని, అంతరాయం లేని సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ భద్రత సన్నద్ధతపై బ్యాంకులు, ఆర్బీఐ, ఎన్‌పీసీఐ, బీమా సంస్థల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ ఈ మేరకు సూచనలు చేశారు. సవాళ్లతో కూడిన సమయంలో ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధరించడంలో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

“కార్యాలయాలతోపాటు డిజిటల్ విధానంలో బ్యాంకింగ్ కార్యకలాపాలు ఎటువంటి అంతరాయాలు లేకుండా సాగేలా చర్యలు తీసుకోవాలి. ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచాలి. యూపీఐ సేవలు సజావుగా సాగేలా జాగ్రత్త వహించాలి. ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలి. దేశ సరిహద్దు ప్రాంతాల్లోని శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబాల భద్రతకు చొరవ చూపాలి. ఈ విషయంలో భద్రతా ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలి” అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకుల ప్రతినిధులను ఆదేశించారని కేంద్ర ఆర్థికశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.



# ఉద్రిక్తత వేళ.. కమల్‌హాసన్ సినిమా ఈవెంట్ వాయిదా

**కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్' . ఈ సినిమా ఆడియో విడుదలను వాయిదా వేస్తున్నట్లు తాజాగా చిత్రబృందం ప్రకటించింది.**

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్' . భారీ తారాగణంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా సిద్ధమవుతోంది. జూన్‌లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఈ నెలలో భారీస్థాయిలో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించాలని టీమ్ భావించింది. ఈవెంట్ కోసం మే 16న ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది. కానీ, ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న టీమ్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఆడియో రిలీజ్‌ను క్యాన్సిల్ చేసింది. త్వరలోనే కొత్త ఆడియో రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని తెలిపింది.

''దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితుల రీత్యా మే 16న జరగనున్న 'థగ్ లైఫ్' ఆడియో రిలీజ్‌ను వాయిదా వేయాలని మేము భావిస్తున్నాం. మన మాతృభూమి పరిరక్షణలో సైనికులు ఎంతగానో పోరాడుతోన్న వేళ ఇది వేడుకలకు సమయం కాదని నమ్ముతున్నాం. సైనికులకు మా మద్దతు తెలియజేస్తున్నాం. దేశ పౌరులుగా ఇది మా బాధ్యత'' అని కమల్‌హాసన్ స్టేట్‌మెంట్ రిలీజ్ చేశారు. ఈవెంట్‌కు సంబంధించి కొత్త డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

'నాయకన్' (1987) లాంటి హిట్ తర్వాత కమల్ మణిరత్నం కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్, యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కమల్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది.



# 'ఆపరేషన్ సిందూర్'పై పాక్ నటుడి వ్యాఖ్యలు..

**తీవ్రంగా స్పందించిన రూపాలీ గంగూలీ**

**'ఆపరేషన్ సిందూర్'పై పాక్ నటుడు ఫవాద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ నటి రూపాలీ గంగూలీ ఖండించారు.**

పహల్గాం ఘటనకు ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పాక్ నటుడు ఫవాద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ నటి రూపాలీ గంగూలీ ఖండించారు. సోషల్ మీడియా వేదికగా ఫవాద్‌ను విమర్శిస్తూ పోస్ట్ పెట్టారు. ''మీలాంటి వాళ్లు భారతీయ సినిమాల్లో పనిచేయడం మాకు సిగ్గుచేటు'' అని అతడి ఫొటోను షేర్ చేశారు. ఈ పోస్ట్‌కు ఆపరేషన్ సిందూర్, ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హ్యాష్ ట్యాగ్‌లను ఆమె జోడించారు.

**జమ్మూపై పాక్ దాడి..** ఆర్మీలో ఉన్న తండ్రి కోసం కమెడియన్ ఎమోషనల్ పోస్ట్

ఇక 'ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థానీ నటీనటులు ఫవాద్ ఖాన్, మహిరా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆల్ ఇండియా సినీ వర్కర్స్ అసోసియేషన్ కూడా ఖండించింది. వారిని తక్షణమే చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చింది. కళల పేరుతో ఇలాంటివారికి గుడ్డిగా మద్దతు ఇవ్వొద్దని చిత్ర పరిశ్రమను అసోసియేషన్ కోరింది. పహల్గాంలో దాడి జరిగిన తర్వాత ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన 'అబీర్ గులాల్' సినిమాను భారత్‌లో బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. అలాగే యూట్యూబ్ (ఇండియా)లో ఈ సినిమా పాటలను తొలగించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఫవాద్‌ఖాన్ ఇన్‌స్టా వేదికగా స్పందిస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూనే, రెచ్చగొట్టే మాటలతో అగ్నికి ఆజ్యం పోయొద్దంటూ వ్యాఖ్యానించాడు. అమాయక ప్రజల ప్రాణాలకు విలువలేదన్నాడు. అంతేకాదు, పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించటం తీవ్ర వివాదాస్పదమైంది.



# అన్నింటి కంటే దేశం ముఖ్యం: 'అబీర్ గులాల్' నటి

**'అబీర్ గులాల్' సినిమా వాయిదాపై నటి రిద్ధి డోగ్రా స్పందించారు. ఓ చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు.**

అన్నింటి కంటే దేశం ముఖ్యమని నటి రిద్ధి డోగ్రా అన్నారు. తాను నటించిన 'అబీర్ గులాల్' సినిమా వాయిదాపై అలా స్పందించారు. పాకిస్థాన్ నటుడు ఫవాద్‌ఖాన్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదల కావాల్సిన ఉండగా.. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా వాయిదా పడింది. ఈ క్రమంలో ఆమె ఓ చిట్ చాట్ లో మాట్లాడారు. సినిమాకి సంబంధించి ప్రస్తుతానికి ఏ విశేషాలు చెప్పలేనని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఈ సినిమాని భారత ప్రభుత్వం బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. ఆర్తి ఎస్. బగ్డీ తెరకెక్కించిన ఈ సినిమాలో రిద్ధి కీలక పాత్ర పోషించగా వాణీ కపూర్ హీరోయిన్.



# శత్రువుల గుండెల్లో భయం నింపాలి..

**ఆర్మీకి సెల్యూట్ చేస్తోన్న సెలబ్రిటీలు**

**భారత్ ఆర్మీకి సెల్యూట్ చేస్తూ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు.**

**దాయాది పాకిస్థాన్ మరోసారి వక్రబుద్ధి చూపి జమ్మూకశ్మీర్ సహా పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్మూ ఎయిర్‌పోర్టుతో పాటు జైసల్మేర్ విమానాశ్రయం లక్ష్యంగా చేసిన దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. దీంతో మన ఆర్మీపై ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మరింత ధైర్యంగా ముందుకుసాగండి.. మీ వెంట మేమున్నాంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నారు. అలాగే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.**

**జమ్మూలో ఉంటోన్న బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ సోదరుడు చెప్పిన మాటలను ఆయన పంచుకున్నారు. అక్కడ దాడి జరిగిన నేపథ్యంలో తన సోదరుడికి ఫోన్ చేసినట్లు చెప్పారు. "భయ్యా.. మనం భారతదేశంలో ఉన్నాం. భారతీయులం. మన రక్షణసైన్యం, వైష్ణోమాతా మనల్ని కంటికిరెప్పలా కాపాడుకుంటారు. పాక్‌కు సంబంధించిన ఒక్క క్షిపణి కూడా మన భూమిని తాకనివ్వరు. భారత్ మాతాకీ జై" అని తన సోదరుడు చెప్పినట్లు అనుపమ్ సోషల్ మీడియాలో తెలిపారు.**

**పాక్ దుస్సాహసం.. తిప్పికొట్టిన భారత్**

**భారత సైన్యానికి మరింత శక్తినివ్వాలని ప్రార్థిస్తున్నాను. మన రక్షణ దళాలు ధైర్యంగా సాగుతూ.. శత్రువుల గుండెల్లో భయాన్ని నింపాలి - సాయిదుర్గతేజ్**

**దీన్ని వాళ్లు ప్రారంభించారు.. మనం ముగిస్తాం. భారత సాయుధ దళాల కోసం ఎప్పుడూ ప్రార్థిస్తూనే ఉంటాం - మంచు విష్ణు**

**శత్రు దేశం జమ్మూను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలంతా జాగ్రత్తగా ఉండండి - కంగనా రనౌత్**

**మమ్మల్ని కాపాడుతున్న మీకు కృతజ్ఞతలు. మీరంతా సురక్షితంగా ఉండండి - వీర్ దాస్**

# ఆ దేశం అద్దెకు తీసుకోవచ్చు.. మీ ఫొటోతో కరెన్సీ: పూరి జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్.. అద్దెకు తీసుకునే వెసులుబాటు ఉన్న దేశం గురించి ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. 'పూరి మ్యూజింగ్స్' పేరిట ఆయన పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

**'పూరి మ్యూజింగ్స్' పేరిట ఆసక్తికర విశేషాలు పంచుకునే దర్శకుడు పూరి జగన్నాథ్ . ఇప్పటికే ఎన్నో కొత్త సంగతులు చెప్పిన ఆయన తాజాగా ఓ దేశం గురించి మాట్లాడారు. అదే కంట్రీ? దాని ప్రత్యేకతలేంటి? ఆయన మాటల్లోనే..**

**"ఓ దేశాన్ని అద్దెకు తీసుకోవచ్చనే విషయం మీకు తెలుసా..?**

చాలామందికి తెలియని ఒక చిన్న దేశం ఉంది. దాని పేరు లిక్టన్‌స్టైన్ . 160 చదరపు కి.మీ. విస్తీర్ణం. కారులో 30 నిమిషాల్లో దాన్ని చుట్టేయొచ్చు. ఎన్నో విమానాశ్రయాల కంటే చిన్నది. ఆ దేశం స్విట్జర్లాండ్, ఆస్ట్రియా మధ్య ఉంది. ఆ దేశాన్ని ఓ రాజు పరిపాలిస్తున్నాడు. ఆ రాయల్ ఫ్యామిలీ ఓ కొండపై నివసిస్తోంది. రోమన్ క్యాథలిక్స్ ఉండే దేశమిది. వారు జర్మన్ మాట్లాడతారు. ఈ దేశానికి వాయు మార్గం, జల మార్గం లేవు. జ్యూరిక్ నుంచి రైల్లోగానీ కార్లోగానీ వెళ్లొచ్చు. భద్రత ఎక్కువగా ఉండే దేశాల్లో ఇదొకటి. జనాభా 40 వేలు కూడా ఉండదు. క్రైమ్ రేట్ లేకపోవడం వల్ల అక్కడి వారు తమ ఇంటికి ఎప్పుడూ తాళం వేయరు. వారంతా ఒకరికి ఒకరు పరిచయం. ట్యాక్స్ బెనిఫిట్ కోసం బయట వారు ఎక్కువగా అక్కడ కంపెనీలు నెలకొల్పుతుంటారు''

''నేషనల్ హాలీడేస్, పండగల వేళ అక్కడి ప్రజలు సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. ఆగస్టు 15.. వారికి నేషనల్ డే. ఒకవేళ కావాలనుకుంటే 70 వేల డాలర్లు చెల్లించి మీరు ఈ దేశాన్ని ఒకరోజు అద్దెకు తీసుకోవచ్చు. మీకు రెడ్ కార్పెట్‌తో వారంతా స్వాగతం పలుకుతారు. రాయల్ ప్యాలెస్‌లో వసతి ఏర్పాటు చేస్తారు. స్ట్రీట్ బోర్డ్స్ మీ పేరిట వెలుస్తాయి. మిమ్మల్ని ఓ రాజులాగా ట్రీట్ చేస్తారు. అంతేకాదు మీ ఫొటోతో ఫేక్ కరెన్సీ క్రియేట్ చేస్తారు. దాంతో, అక్కడ మీరు ఏది కావాలంటే అది కొనుక్కోవచ్చు. టూరిస్టులతో అక్కడివారు ఎంతో ప్రేమగా ఉంటారు'' అని వివరించారు.

# సింగర్‌తో కనిపించిన జయం రవి: నటుడి భార్య ఎమోషనల్ పోస్ట్!



**తన భర్త జయం రవిని ఉద్దేశిస్తూ ఆర్తి రవి సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.**

**నటుడు జయం రవి .. గాయని కెనీషాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, అందుకే భార్య ఆర్తికి విడాకులు ఇచ్చారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. సింగర్‌తో తాను రిలేషన్‌లో ఉన్నట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని గతంలో చెప్పిన నటుడు.. ఆమెతో కలిసి తాజాగా ఓ వేడుకలో కనిపించడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి ఆర్తి రవి సోషల్ మీడియా వేదికగా నోట్ విడుదల చేశారు.**

**"గత ఏడాదిగా నేను ఏం మాట్లాడడం లేదు. నా కంటే నా కుమారుల ప్రశాంతతే ముఖ్యం అనుకున్నా. ఆరోపణలు భరించా. అంతమాత్రాన నా వైపు నిజం లేదని కాదు. ఈ రోజు ప్రపంచమంతా ఫొటోలను (జయం రవి, కెనీషా) చూసింది. మా విడాకుల ప్రాసెస్ ఇంకా కొనసాగుతోంది. కానీ, 18 ఏళ్లపాటు నాకు తోడుగా ఉన్న వ్యక్తి అలా చేశారు. కొన్ని నెలలుగా వారి (పిల్లలు) బాధ్యత నాదే. ఆయన్నుంచి ఆర్థికంగానే కాదు నైతికంగానూ సపోర్ట్ లేదు. వాటికితోడు ఇప్పుడు ఇంటి విషయంలో బ్యాంకు నుంచి సమస్య ఎదురైంది. అప్పుడు నేను లెక్కల కంటే ప్రేమకే విలువిచ్చా"**

**"ప్రేమ విషయంలో నేను బాధపడటం లేదు. 10, 14 ఏళ్ల వయసున్న నా పిల్లలకు భద్రత కావాలి. సైలెన్స్ కాదు. చట్టపరమైన అంశాలు వారికి తెలియకపోయినా ఏం జరుగుతుందో అర్థం చేసుకోగలరు. ఫోన్ కాల్ లిఫ్ట్ చేయకపోవడం, మీటింగ్స్ క్యాన్సిల్ చేయడం, మెసేజ్‌కు రిప్లై ఇవ్వకపోవడం.. గాయాల్లాంటివి. నేను ఈరోజు ఓ భార్యగా, అన్యాయానికి గురైన మహిళగా కాదు పిల్లల శ్రేయస్సే లక్ష్యంగా ఉన్న తల్లిగా మాట్లాడుతున్నా. ఇప్పుడు నేను మాట్లాడకపోతే.. వారికి భవిష్యత్తు లేనట్టే. మీరు నిజాన్ని మార్చలేరు. తండ్రి అంటే టైటిల్ మాత్రమే కాదు అదో బాధ్యత. విడాకుల విషయంలో తుది తీర్పు వెలువడే వరకూ నా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా పేరు ఆర్తి రవి అనే ఉంటుంది. నేను ఏడవడం లేదు. అరవడం లేదు. ఇప్పటికీ నాన్నా అని నిన్ను పిలుస్తున్న పిల్లల కోసం నిలబడ్డా" అని పేర్కొన్నారు.**

# భారత సైన్యానికి ఐసీసీ ఛైర్మన్ జై షా సంఘీభావం



**పాక్ దాడులను సమర్థంగా తిప్పికొడుతున్న భారత సైనికులను ఐసీసీ ఛైర్మన్ జై షా కీర్తించారు**

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం.. ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ విచక్షణ కోల్పోయి డ్రోన్ దాడులు, కాల్పులకు తెగబడుతోంది. వీటిని ఎప్పటికప్పుడు భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. ఈ నేపథ్యంలో భారత జవాన్లకు ఐసీసీ ఛైర్మన్ జై షా తన సంఘీభావం తెలిపారు. మన సైనికుల శౌర్యం, ధైర్య సాహసాలను కీర్తిస్తూ వారికి సెల్యూట్ చేశారు. 'మన భారత సైన్యం మనకు గర్వకారణం. మన మాతృభూమిని, ప్రజలను రక్షించడంలో వారు చూపుతున్న తెగువను వ్యక్తపరచడానికి పదాలు సరిపోవు. ఉగ్రవాదం నుంచి మన దేశాన్ని కాపాడుతున్న ధైర్యవంతులైన సైనికులకు వందనం. మన హీరోలను గౌరవించడానికి, బలమైన, మరింత ఐక్యమైన భారతదేశాన్ని నిర్మించడానికి మనమంతా కలసికట్టుగా కృషిచేద్దాం. జైహింద్' అని జై షా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రాశారు.




## మేమంతా మీ వెంటే..: త్రివిధ దళాలకు మద్దతుగా క్రీడాకారులు

రోహిత్ శర్మ, పీవీ సింధుతోపాటు పలువురు భారతీయ క్రీడాకారులు భారత ఆర్మీకి మద్దతు తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టారు.

'ఆపరేషన్ సిందూర్' అనంతరం భారత్ - పాక్ మధ్య అలజడి వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. దేశ సరిహద్దుల్లో పాక్ పాల్పడుతున్న దుశ్చర్యలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది. దేశ ప్రజల సంరక్షణ కోసం శ్రమిస్తోన్న త్రివిధ దళాలకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. సైన్యం సేవలను కొనియాడుతూ తాజాగా పలువురు క్రీడాకారులు సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. సైన్యం వెంటే తాము ఉన్నట్లు తెలిపారు.

"దేశ సంరక్షణలో భాగంగా మన సైన్యం తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని గౌరవిస్తున్నా. మన దేశ గౌరవాన్ని పెంచడంలో వారు ఎప్పుడూ ముందుంటారు. కాబట్టి, ఇలాంటి క్లిష్ట సమయాల్లో తప్పుడు కథనాల వ్యాప్తి, అలాంటి వార్తలను నమ్మకుండా ప్రతీ భారతీయుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" - క్రికెటర్ రోహిత్ శర్మ

"క్లిష్ట సమయంలో అనుక్షణం దేశాన్ని సంరక్షిస్తోన్న మన సైనికులకు సెల్యూట్. మన వీరుల అచంచల ధైర్యసాహసాలకు, దేశం కోసం వారితోపాటు వారి కుటుంబాలు చేసే త్యాగాలకు మనమంతా ఎప్పటికీ రుణపడి ఉండాలి" - విరాట్ కోహ్లీ

"మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగమే మన జాతికి బలం. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితుల వేళ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన మీ ధైర్యం, నిస్వార్థ సేవలను ఎల్లవేళలా మేము గుర్తు చేసుకుంటాం. దేశం మొత్తం మీ వెంట నడుస్తోంది" - బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు

"జమ్మూపై పాక్ చేపట్టిన డ్రోన్ దాడిని సమర్థవంతంగా అడ్డుకున్న పోరాట యోధులను గౌరవిద్దాం"

# భారత్ – పాక్ ఉద్రిక్తతల ఎఫెక్ట్..




## వారం పాటు వాయిదా

**ఐపీఎల్ నిర్వహణపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. ఓ వైపు యుద్ధం జరుగుతున్న వేళ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదంటూ ఐపీఎల్‌ను వాయిదా వేశారు.**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ వాయిదా పడింది. భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు.

"ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపీఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. మన సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు సెల్యూట్ చేస్తున్నాం'' అని ఐపీఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది.

**భయమేసింది.. బాంబులు పడతాయని అరుపులు: ఛీర్‌లీడర్ వీడియో వైరల్**

ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. ''ఓవైపు దేశం యుద్ధం చేస్తుంటే.. ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదనిపించింది'' అని వెల్లడించారు. ఇప్పటికే పంజాబ్, దిల్లీ మ్యాచ్ భద్రతా కారణాలరీత్యా మధ్యలోనే రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇవాళ లఖ్‌నవూ ఆర్సీబీ మధ్య లఖ్‌నవూలోని ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. నేటి నుంచి నిలిపివేత అమల్లోకి రానుంది. ప్రస్తుత సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు ఉన్నాయి. రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్ మిగిలి ఉంది. షెడ్యూల్ ప్రకారం మే 25న కోల్‌కతా వేదికగా ఐపీఎల్ ఫైనల్ ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో గుజరాత్ (16), బెంగళూరు (16), పంజాబ్ (15), ముంబయి (14) ఉన్నాయి.

**ఐపీఎల్ ఆటగాళ్ల 'ప్రత్యేక రైలు'కు అనుమతి లేదా?**

భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో ఐపీఎల్ నిరవధికంగా వాయిదా పడింది. ధర్మశాలలో ఉన్న పంజాబ్, దిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లను, సిబ్బందిని అక్కడినుంచి దిల్లీకి తరలించేందుకు తొలుత ప్రత్యేక రైలును బీసీసీఐ ఏర్పాటుచేసింది. వందేభారత్‌లో తరలించేందుకు సిద్ధమైంది. అయితే, తాజా కథనాల ప్రకారం.. ఆ రైలు వెళ్లేందుకు రైల్వేశాఖ అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. పఠాన్‌కోట్ మీదుగా వెళ్లాల్సిన నేపథ్యంలో రిస్క్ తీసుకోదలుచుకోలేదని రైల్వే వర్గాలు తెలిపాయి. దీంతో మరోవిధంగా ఆటగాళ్లను తరలించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల్లో దిల్లీకి తీసుకెళ్లాలని భావిస్తోంది.

# పాక్ యుద్ధాన్ని ఎంచుకుంది..

## ఎప్పటికీ మరిచిపోలేని సమాధానం ఇస్తాం: సెహ్వాగ్



**పాకిస్థాన్ దుశ్చర్యలను భారత సైన్యం తిప్పికొడుతోంది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడం పాక్‌కు ఇష్టం లేదని మరోసారి నిరూపితమైందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.**

తమ దేశంలో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత్‌పై పాకిస్థాన్ దాడి చేయడం మొదలుపెట్టింది. రెచ్చగొట్టేలా క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను ప్రయోగించింది. వాటన్నింటినీ భారత ఆర్మీ తిప్పికొట్టింది. ఈక్రమంలో టీమ్ఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ సోషల్ మీడియా వేదికగా పాక్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. పాక్ యుద్ధం కోరుకుందని.. భారత్ సరైన గుణపాఠం చెబుతుందని పేర్కొన్నాడు. భారత ఆర్మీపై జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా కూడా ప్రశంసల వర్షం కురిపించాడు.

**లీగ్ కొనసాగేనా..?**

''ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసినప్పుడు పాక్ మౌనంగా ఉండాలి. కానీ, ఆ ఛాన్స్‌ను వదులుకొని యుద్ధం కోరుకుంది. ఉగ్రవాదుల ఆస్తులను రక్షించడం, వారి గురించి ఎక్కువగా మాట్లాడటం చేసింది. దానికి మన భద్రతా దళాలు తప్పకుండా సరైన సమాధానం ఇస్తుంది. అదీనూ పాకిస్థాన్ ఎప్పటికీ మరిచిపోలేని రీతిలో ఉంటుంది'' అని సెహ్వాగ్ పోస్టు పెట్టాడు.

**మీకిదే నా సెల్యూట్: నీరజ్**

''అత్యంత ధైర్యవంతమైన భారత ఆర్మీ పట్ల గర్వపడుతున్నాం. దేశం కోసం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భద్రతా దళాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రతిఒక్కరూ ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను పాటించి సురక్షితంగా ఉండాలి. జై భారత్, జై భారత్‌కీ సేన'' అని నీరజ్ చోప్రా పోస్టు చేశాడు. ''సరిహద్దుల్లో పాక్ చేసిన డ్రోన్ దాడులను భారత్ సమర్థవంతంగా అడ్డుకొంది. ధైర్యసాహసాలు కలిగిన భారత సైన్యం నిబద్ధతకు ఇదే నిదర్శనం. భారత్ బలంగా నిలబడుతుంది. జై హింద్'' అని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ స్పందించాడు.

# ఐపీఎల్ టికెట్ల డబ్బులు రీఫండ్




**భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 2025 సీజన్‌లో మిగతా మ్యాచ్‌లు వారంపాటు వాయిదా పడ్డాయి.**

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 2025 సీజన్‌లో మిగతా మ్యాచ్‌లు వారంపాటు వాయిదా పడ్డాయి. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ అధికారులు తెలిపారు. 'దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైన నిర్ణయం కాదు' అని వారు వెల్లడించారు.

మే 8న ధర్మశాల వేదికగా జరుగుతున్న పంజాబ్ కింగ్స్ , దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌ను భద్రతా కారణాలరీత్యా అర్ధాంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. నిజానికి ఈ రోజు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ బీసీసీఐ నిర్ణయంతో నేటి నుంచే నిలిపివేత అమల్లోకి రానుంది. దీంతో ఈ రోజు నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు జరగడం లేదు.

ఈ నేపథ్యంలో అభిమానులకు టికెట్ల డబ్బులను ఫ్రాంఛైజీలు తిరిగి చెల్లిస్తున్నాయి. ముందు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మే 10న ఉప్పల్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ , సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ బీసీసీఐ నిర్ణయం మేరకు ఈ మ్యాచ్ రేపు జరగడం లేదు. దీంతో ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న అభిమానులకు సన్‌రైజర్స్ యాజమాన్యం రీఫండ్ ప్రక్రియను చేపట్టింది.